క్లుప్తంగా

'మండల అభివృద్ధికి సహకరిస్తా'



జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్‌ను కలిసిన ఎంపీపీ, సిబ్బంది

ఏలూరు రూరల్: ఏలూరు మండల అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. గురువారం ఏలూరు మండల పరిషత్ అధ్యక్షుడు పెన్మత్స శ్రీనివాసరాజు, కార్యాలయ ఏఓ వై.సుజాత, సిబ్బంది జెడ్పీ అతిథి గృహంలో చైర్మన్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. శ్రీనివాసరాజు మాట్లాడుతూ దెందులూరు నుంచి పద్మశ్రీ జెడ్పీ చైర్మన్‌గా ఎన్నిక కావడం హర్షణీయమన్నారు. మండల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. దీనిపై స్పందించిన చైర్మన్ తప్పక సహకరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పద్మశ్రీ ప్రసాద్‌లకు శాలువ కప్పి అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



కబడ్డీ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఏలూరు (టూటౌన్): జన్ భాగిదరి కార్యక్రమంలో భాగంగా స్థానిక సత్రంపాడు ఐటీఐ ప్రాంగణంలో గురువారం విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించినట్టు ప్రభుత్వ ఐటీఐ ప్రధానాధికారి రజిత తెలిపారు. ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు భారత దేశం జి-20 ప్రెసిడెన్సీలో భాగంగా జన్ భాగిదరి కార్యక్రమం ఈ నెల 1 నుంచి గురువారం వరకు సత్రంపాడు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో నిర్వహించామన్నారు. ముగింపు రోజు కోకో, కబడ్డీ, వాలీబాల్, బాడ్మింటన్ ఆటలు నిర్వహించినట్టు చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు, శిక్షణ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన

ఏలూరు (టూటౌన్): దేశంలో బీజేపీ ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను గాలికి వదిలేసిందని, ఐసీడీఎస్ లక్ష్యానికి విరుద్ధంగా సెంటర్లను కుదించేందుకు నూతన విద్యావిధానాన్ని అమల్లోకి తెచ్చిందని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు పి.హైమావతి విమర్శించారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు టి.రజిని, భవాని, సెక్టార్ లీడర్లు సీహెచ్ ఆందోళనమ్మ, టి.సుకన్య, జి.విజయలక్ష్మి, బి.కనకదుర్గ, వెంకటలక్ష్మి, అంగన్‌వాడీలు, హెల్పర్లు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మెరక పనులు పూర్తి

- రూ.8.49 కోట్లు మంజూరు
- 1,962 మంది పేదలకు లబ్ధి



శ్రీపర్రు జగనన్న కాలనీలో చేపట్టిన రెండో విడత మెరక పనులు (ఫైల్)

ఏలూరు రూరల్: జగనన్న కాలనీల్లో రెండో విడత మెరక పనులు పూర్తయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం రూ.8.49 కోట్లు మంజూరు చేసింది. ఏలూరు మండలం దెందులూరు నియోజకవర్గ గ్రామాల్లో ఏడు లేఅవుట్లు మెరక చేయడం వల్ల 1,962 మంది లబ్ధిదారులకు మేలు చేకూరనుంది. వర్షాకాలానికి ముందుగానే మెరక పనుల పూర్తికి హౌసింగ్ అధికారులు కృషి చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు, హౌసింగ్ ఏఈ ప్రవీణ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు మెరక పనులు నిత్యం పర్యవేక్షించారు.

ముంపు ముప్పునకు చెక్

కొల్లేరు గ్రామాల్లో వర్షాకాలంలో పేదల ఇళ్లు ముంపు బారిన పడుతున్నాయి. ప్రత్తికోళ్లలంక బీసీ, ఎస్సీ కాలనీల్లో వరదనీరు చేరుతుంది. రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. దీంతో స్థానికులు తమ స్థలాలను మెరక చేసుకున్నారు. ఏటా వచ్చే వరద గుడివాకలంక బీసీ కాలనీని ముంచేస్తుంది. శ్రీపర్రు బీసీకాలనీలో తమ్మిలేరు వరదనీరు చేరుతుంది. ఈ సమస్యలన్నింటినీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గుర్తించి శ్రీపర్రు, మానూరు, జాలిపూడి, గుడివాకలంక, మొండికోడు, ప్రత్తికోళ్లలంక తదితర గ్రామాల్లోని జగనన్న కాలనీలకు ఎలాంటి వరద ముంపు లేకుండా మెరక చేయాలని నిర్ణయించింది. రెండో విడత మెరక పనులు పూర్తి చేసింది. వరదలకు ఇళ్లు ముంపు ముప్పు తప్పనుంది. ప్రభుత్వమే మెరక పనులు చేపట్టడం వల్ల ఒక్కో లబ్ధిదారుడుకు రూ.1 లక్ష ఖర్చు మిగిలింది.

రెండో విడత పనులు ఇలా..

గ్రామం	మెరకచేసిన స్థలం ఎకరాల్లో	ఖర్చు
గుడివాకలంక	5.24	రూ.1.06 కోట్లు
కోమటిలంక	1.03	రూ.26.72 లక్షలు
గురుకులపేట	3.22	రూ.47.60 లక్షలు
మాదేపల్లి	20.77	రూ.2.67 కోట్లు
మానూరు	1.86	రూ.47.30 లక్షలు
శ్రీపర్రు	10.86	రూ.2.03 కోట్లు
జాలిపూడి	2.95	రూ.46.91 లక్షలు
ప్రత్తికోళ్లలంక	2.37	రూ.61.50 లక్షలు

సంతోషంగా ఉంది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వల్ల నాకు ఇల్లు వచ్చింది. ప్రభుత్వమే స్థలం మెరక చేయించింది. స్థలం మెరక పనులకు అయ్యే రూ.1 లక్ష ఖర్చు మాకు మిగిలినట్టే. ఈ డబ్బు ఇంటి నిర్మాణంలో ఖర్చు చేసుకోవచ్చు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థలంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరు చేయడం సంతోషంగా ఉంది.

– ఎం.నాగేశ్వరమ్మ, శనివారపుపేట

ఎమ్మెల్యే కృషితో పనులు పూర్తి



ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రత్యేక శ్రద్ధ వహించి రెండో విడత మెరక పనుల గురించి ప్రభుత్వానికి నివేదించి నిధులు మంజూరు చేయించారు. కాంట్రాక్టర్లు ఆసక్తి చూపకపోవడంతో వారిని ఒప్పించి పనులు చేయించారు. వర్షాకాలానికి ముందే పనులు ముగించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే కృషి వల్లనే మెరక పనులు పూర్తయ్యాయి.

– ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు

శాశ్వత భూ హక్కుతో రైతులకు మేలు



జగనన్న శాశ్వత భూహక్కు సదస్సులో మ్యాప్‌ను ప్రదర్శిస్తున్న అధికారులు

ఏలూరు రూరల్: ప్రభుత్వం చేపట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు పథకం రైతులు, ప్రజలకు ఎంతో మేలు చేస్తుందని తహసీల్దార్ బి.సోమశేఖర్ అన్నారు. గురువారం ఏలూరు మండలం కొక్కిరాయిలంకలో జగనన్న భూహక్కు పథకంపై అధికారులు రైతులు, ప్రజలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సోమశేఖర్ మాట్లాడుతూ సాంకేతికత ఉపయోగించి ప్రభుత్వం భూముల రీసర్వే చేపట్టిందన్నారు. దీంతో భూమి హక్కుదారులకు భద్రత పెరిగిందని తెలిపారు. డ్రోన్ సర్వే, ఆర్థో రెక్టిఫైయిడ్ ఇమేజ్ వల్ల భూముల ఖచ్చితత్వం ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి వచ్చాయన్నారు. రానున్న రోజుల్లో ప్రతి రైతూ తమ భూమి వివరాలు ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చని చెప్పారు. అనంతరం అధికారులు, సిబ్బంది భూముల మ్యాప్‌ను ప్రదర్శించారు. సర్పంచ్ తోకల అమల అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ రమణ, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, మండల సర్వేయర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు అభినందనీయం



హోంగార్డులకు చెక్కును అందించిన ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు టౌన్: పోలీసులకు సమానంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించిన హోంగార్డ్స్ సేవలు అభినందనీయమని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి అభినందించారు. స్థానిక జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం పదవీ విరమణ చేసిన ఇద్దరు హోంగార్డులకు సంక్షేమ నిధి నుంచి ఆర్థిక సాయం చెక్కులు ఎస్పీ అందజేశారు. ఎస్ఎస్ ఫక్రుద్దీన్‌కు రూ.5,54,510, జీబీఎస్ ప్రసాద్‌కు రూ.5,35,940లు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన సిబ్బంది తమ కుటుంబంతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. తమకు ఎల్లప్పుడూ తామంతా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఏలూరు ఆర్ఐ పవన్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

భాషా పండితుల పోస్టుల భర్తీకి వినతి

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లాలోని వివిధ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న భాషా పండితుల పోస్టుల భర్తీ కోరుతూ పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయ ఏడీకి గురువారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వి.గంగాధర్, ఉదయభాస్కర్, అజాద్, రాంబాబు, రామ్మోహన్ రావు, డి.చంద్రశేఖర్, ఆర్ శేఖర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే పనులు ప్రారంభం

దెందులూరు : గ్రామాల్లో సర్వేకు వచ్చినప్పుడు సహకరించాలని ప్రభుత్వ లక్ష్యాల సాధనలో తమ వంతు సహాయసహకారాలు సర్వే సిబ్బంది అందివ్వాలని ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ రమణ అన్నారు. గురువారం సానిగూడెం రైతుభరోసా కేంద్రంలో గ్రామ సర్పంచ్ శనిపల్లి రామకృష్ణ (విష్ణు) అధ్యక్షతన మండల సర్వేయర్ వై.రమణ ఆధ్వర్యంలో సమగ్ర రీసర్వే గ్రామ సభ జరిగింది. సమగ్ర రీసర్వే రైతులకు వరమని తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య అన్నారు. గ్రామ సభలో తహశీల్దార్ క్షుణ్ణంగా రైతులకు మ్యాప్‌ల ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం శ్రీరామవరం, సానిగూడెం, ఖండ్రికనర్సింహపురం, ఉప్పుగూడెం, చల్లపల్లి గ్రామాల్లో సమగ్ర రీసర్వే గ్రామ సభలు జరిగాయి.

నిత్యాన్నదాన పథకానికి రూ.3.65 లక్షల విరాళం



దాత కుటుంబానికి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి తెలంగాణా రాష్ట్రం ఖమ్మంకు చెందిన శ్రీనాధరాజు విజయ భాస్కర రాజు గురువారం రూ. 3,65,000 విరాళంగా అందజేశారు. ముందుగా ఆయన కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాతకు ఆలయ ఏఈఓ కేఎల్ఎస్ రాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

గురుకులాల్లో అదనపు సీట్లు కేటాయించాలి



మంత్రి నాగార్జున చిత్రపటాన్ని కోఆర్డినేటర్ భారతికి అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): జిల్లాలోని ఏపీ గురుకుల పాఠశాలల్లో అదనపు సీట్లు కేటాయించాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ జిల్లా కోఆర్డినేటర్ భారతిని కోరారు. స్థానిక అమీనాపేటలోని డీసీఓ కార్యాలయంలో గురువారం ఆమెను కలిసి విజ్ఞప్తి చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున పుట్టిన రోజును పురస్కరించుకుని ఆయన చిత్రపటాన్ని కార్యాలయంలో ఏర్పాటుచేయాలని ఆమె అందజేశారు. ఎస్సీల సంక్షేమం, అభివృద్ధికి పథకాలను అందించే విషయంలో మంత్రి నాగార్జున ప్రభుత్వంతో సంప్రదించి పూర్తి స్థాయిలో సహకారం అందజేస్తున్నారని సంతోష్ కుమార్ తెలిపారు. ఎస్సీలు, క్రైస్తవుల శ్మశాన వాటికల విషయంలో చొరవ తీసుకుని తాము విజ్ఞాపన పత్రం అందించిన వెంటనే విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లి మాట్లాడినట్టు చెప్పారు. కార్యక్రమంలో దళిత మహాసభ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కొరబండి బాబూరావు, అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు పల్లా యేసేబు, పులవర్తి డేవిడ్, గారపాటి నాగేశ్వరరావు, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లల స్కూల్



కంప్యూటర్, వినికిడి యంత్రం ద్వారా శిక్షణ పొందుతున్న ప్రత్యేక అవసరాలుగల విద్యార్థులు

పెదవేగి : ప్రత్యేక అవసరాలు గల బాలబాలికల విద్యాభివృద్ధి కోసం పెదవేగి మండలంలోని జానంపేట పంచాయతీ పరిధి ప్రకాశ్‌నగర్‌లో 2006వ సంవత్సరంలో డిసాలెస్ స్పెషల్ స్కూల్ (చెవుడు, మూగ విద్యార్థులకు మాత్రమే)ను స్థాపించారు. ఈ పాఠశాల 'డాటర్స్ ఆఫ్ సెయింట్ ఫ్రాన్సిస్ డిసాలెస్' అనే మిషనరీ ఎన్‌జీఓ సంస్థ ద్వారా నడుపుతున్నారు. ఈ పాఠశాల్లో 1 తరగతి నుంచి 10వ తరగతి వరకూ బోధన చేస్తున్నారు. ఈ పాఠశాల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గుర్తింపు పొందింది. ప్రత్యేక శిక్షణ పొందిన బోధన సిబ్బందితో తరగతులను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలో ప్రస్తుతం 50 మంది విద్యార్థినీ, విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మరో 50 మంది వరకూ అడ్మిషన్‌లు పొందేందుకు అవకాశం ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఇక్కడ జిల్లా నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల్లో చెప్పే స్టేట్ సిలబస్‌నే ఇక్కడ కూడా బోధిస్తారు. 15 సంవత్సరాలలోపు మూగ, చెవుడు విద్యార్థులు ఇక్కడ దరఖాస్తు చేసుకోవటానికి అర్హులు. విద్యతోపాటు, హాస్టల్ సదుపాయం సైతం ఉచితంగా కల్పించారు. చదువుతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో సైతం శిక్షణ ఇస్తున్నారు. వివరాలకు ఫోన్ 62814 28466, 89854 68473, 73560 06778 నంబర్లను సంప్రదించవచ్చు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి



డాటర్స్ ఆఫ్ సెయింట్ ఫ్రాన్సిస్ డిసాలెస్ స్కూల్‌ను ఏర్పాటుచేసి పేద, మధ్యతరగతి కుటుంబాల్లోని చెవిటి, మూగ చిన్నారులకు బాసటగా నిలిచేందుకు కృషి చేస్తున్నాం. అతి తక్కువ ఫీజులతో అందించే ఈ విద్య, వసతి సౌకర్యాన్ని అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని అభివృద్ధి సాధించాలి.

– సిస్టర్ సుష మ్యాథ్యూ డిసాలెస్ స్కూల్ ప్రిన్సిపాల్

గురుకుల విద్యార్థినులకు సత్కారం



హర్షవర్ధినిని సత్కరించి, ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న సర్పంచ్ స్వర్ణలత

ద్వారకాతిరుమల: అనుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే కష్టపడి చదవాలని సర్పంచ్ కుంటం స్వర్ణలత విద్యార్థులకు సూచించారు. ఇటీవల విడుదలైన పదవతరగతి పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులను గురువారం ఆమె ఘనంగా సత్కరించారు. ముందుగా 556 మార్కులు పొందిన ఏలూరు మండలం తిమ్మారావుగూడెంకు చెందిన బోడిగడ్డ హర్షవర్ధిని, అలాగే 542 మార్కులు పొందిన మొండూరుకు చెందిన భీమడోలు వర్షిణి, 532 మార్కులు పొందిన తిమ్మాపురానికి చెందిన వసంతాటి రమ్యలకు దుశ్శాలువా కప్పి, ప్రశంసా పత్రాలను అందించారు. అనంతరం సర్పంచ్ స్వర్ణలత మాట్లాడుతూ విద్యార్థులు మున్ముందు ఇదే తరహాలో మంచి మార్కులు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బి.రాణి, సిబ్బంది ఉన్నారు.

విద్యాభివృద్ధికి సీఎం జగన్ కృషి

జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు

పెదపాడు : విద్యారంగంలో అనేక సంస్కరణలను అమలు చేస్తున్న ప్రభుత్వం విద్యలో నాణ్యత, విద్యార్థుల్లో నైపుణ్యాన్ని ప్రోత్సహించేందుకు జగనన్న ఆణిముత్యాలు వేడుకలను నిర్వహిస్తోందని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు తెలిపారు. పెదపాడు మండలం సత్యవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థులకు గురువారం చైర్‌పర్సన్ చేతుల మీదుగా నగదు బహుమతి, మెడల్స్, సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. ఈసందర్భంగా సభలో ఆమె మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం పేద విద్యార్థుల విద్యకోసం వారి ఉన్నతి కోసం అహర్నిశలు పాటు పడుతోందన్నారు. జగనన్న ఆణిముత్యాలు సాధించిన విద్యార్థులను చూసి మిగతా విద్యార్థులు స్ఫూర్తి పొందాలన్నారు. బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ పదోతరగతి ఫలితాల్లో తమ సొంత గ్రామం సత్యవోలులోని జెడ్పీ హైస్కూల్ మండలంలో 75 శాతం ఫలితాలు సాధించి మొదటి స్థానంలో నిలిచినందుకు గర్వంగా ఉందన్నారు. ఘంటా ప్రసాదరావు ఆర్థిక సహకారంతో స్కూల్ ఉన్నత స్థితికి చేరకుందని ప్రధానోపాధ్యాయురాలు కె.రాధ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు, ఎంపీడీవో నిర్మలజ్యోతి, ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి, గ్రామ సర్పంచ్ రంభ ఉమామహేశ్వరి, ఎస్.కొత్తపల్లి సర్పంచ్ చేపేని రంగారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. నియోజకవర్గంలో మూడో స్థానం సాధించిన బడి శ్రేష్ఠ అనే విద్యార్థికి నగదు బహుమతి మెడల్ ప్రసంశా పత్రం అందించారు, చైర్మన్ దంపతులను పూల మాలలు, దుశ్శాలువాతోను ఘనంగా సత్కరించారు.

వైఎస్సార్ పశు బీమా రైతులకు వరం



వైఎస్సార్ బీమాపై రైతులకు అవగాహన కల్పిస్తున్న నెహ్రూ

ఏలూరు రూరల్: వైఎస్సార్ పశుబీమా పథకం పాడి రైతులకు వరం వంటిదని జిల్లా పశుసంవర్ధకశాఖ సయుంక్త సంచాలకులు డాక్టర్ జి.నెహ్రూ అన్నారు. గురువారం ఏలూరు మండలం చాటపర్రు పశు వైద్యశాలలో రైతులకు ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాడి రైతులు, గొర్రెలు, మేకలు పెంపకందార్ల కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పశుబీమా పథకం ఏర్పాటుచేసిందని చెప్పారు. పశువు చనిపోయినప్పుడు రైతును ఈ పథకం ఆర్థికంగా ఆదుకుంటుందని అన్నారు. ఒక్కో కుటుంబం కనిష్ఠంగా 5 గేదెలు, 50 గొర్రెలు లేదా మేకలను బీమా చేసుకోవచ్చన్నారు. రేషన్‌కార్డు ఉన్నవారు 20 శాతం, కార్డు లేనివారు 50 శాతం ప్రీమియం చెల్లిస్తే బీమా అర్హత పొందుతారని వివరించారు. ఒక్కసారి ప్రీమియం చెల్లిస్తే మూడేళ్లపాటు బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపసంచాలకులు డాక్టర్ రామచంద్రరావు, సహాయ సంచాలకులు డాక్టర్ పి.సుబ్రహ్మణ్యం, స్థానిక వైద్యురాలు ఎం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల సంక్షేమానికి చట్టాలు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సంఘం నాయకులు

ఏలూరు (టూటౌన్): వృద్ధులపై దాడులు, వేధింపులను ప్రభుత్వం అరికట్టే విధంగా చట్టాలను రూపొందించాలని వృద్ధుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామచంద్రరావు, జిల్లా అధ్యక్షుడు ఎం.శివరామకృష్ణారావు కోరారు. వృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న సంఘ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు వృద్ధులు ర్యాలీ నిర్వహించారు. వృద్ధుల సంక్షేమ చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేయాలంటూ నినదించారు. సమాజంలో వృద్ధులు జ్ఞాన భాండాగారాలని, సమాజ హితం కోసం వారి సేవలను వినియోగించుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ వృద్ధుల పట్ల ప్రేమ, ఆప్యాయత, ఆదరాభిమానాలు చూపాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వృద్ధుల సంక్షేమ సంఘం నాయకులు బి.సత్యనారాయణ, డాక్టర్ ఎన్‌వీఎస్ ప్రసాద్, డి.భాస్కరరావు, వి.శేషగిరిరావు, ఎస్.రాధాకృష్ణ, కె.కన్నయ్య పాల్గొన్నారు.

చింత చెట్టుకు మంటలు



అప్పారావుపాలెం - దెందులూరు మధ్య దగ్ధమవుతున్న చింతచెట్టు

దెందులూరు: అప్పారావుపాలెం– దెందులూరు గ్రామాల మధ్య రోడ్డు పక్కన ఉన్న భారీ చింత చెట్టుకు గురువారం మంటలు వ్యాపించాయి. స్థానికులు, దెందులూరు విద్యుత్ శాఖ లైన్ మెన్లు వీరయ్య, శేషు భీమడోలు ఫైర్ సిబ్బందికి సమాచారమిచ్చారు. ఫైర్‌సిబ్బంది వాహనంతో అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. భానుడి ప్రతాపానికి చెట్టు మొదలు అంతా ఎండిపోవడం, ఆకతాయిలు ఏదైనా నిప్పురవ్వ పడవేయడంతో మంటలు వ్యాపించి ఉంటాయని స్థానికులు చెబుతున్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	44	అరటి కాయ (1)	08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	38	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	50	ములక్కాడలు	12
బెండకాయలు	34	కంద	52
పచ్చిమిర్చి	74	బీట్‌రూట్	40
కాకర కాయలు	48	కీరా దోస	50
బీరకాయలు	34	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	46	అల్లం	232
క్యాబేజీ	28	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	38	పాలకూర	10
దొండకాయలు	30	చుక్కకూర	10
బంగాళదుంపలు	28	తోటకూర	10
ఉల్లిపాయలు	22	గోంగూర	07
గోరుచిక్కుడు	50	పుదీనా	05
దోసకాయలు	20	బఠాణి	--
అనబకాయ (1)	20	క్యాప్సికమ్	76
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	26

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	22
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	28
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	34
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	26

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	19
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	24
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	20
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	25
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	19
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	28
ఏలూరు -బీహెచ్ఈఎల్	09.00	4794	34
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	33
ఏలూరు -తిరుపతి	16.00	4830	26